సాక్షి
రంగారెడ్డి
గురువారం । 19 । జూన్ । 2025



సత్తా చాటాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ఆకాంక్షించారు. 8లో▸



కలెక్టర్.. పెట్టండి నజర్!

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో భూమి బంగారమే. గజం స్థలం విలువ తులం బంగారానికి కంటే అధికమే. 8లో▸



పనుల పరిశీలన

దావుత్‌ఖాన్‌గూడలో నిలిచిపోయిన స్కూల్ నిర్మాణ పనులు విద్యా కమిషన్ మెంబర్ జ్యోత్స్న పారిజాత సందర్శించారు. 8లో▸

న్యూస్‌రీల్

బస్ పాస్ చార్జీలు తగ్గించాలి

షాద్‌నగర్: బస్ పాస్‌ల ధరలు పెంచడంతో విద్యార్థులపై భారం పడుతోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ అన్నారు. పెంచిన 20శాతం చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డిపో మేనేజర్ సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. లేదంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. విద్యార్థి నాయకులు ఆకాశ్, రాహుల్, శ్రీను పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసం బీఆర్ఎస్ ధర్నా



సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: వ్యవసాయానికి కోతలు లేకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలువురు రైతులతో కలిసి గట్టుప్పలపల్లి సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలివీచినా గంటల తరబడి సరఫరా నిలిపేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, రాజు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



షాబాద్: సమాచార కమిషనర్‌గా నియమితులైన పీవీ శ్రీనివాస్‌కు పలువురు జర్నలిస్టులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ మల్లారెడ్డి బుధవారం ఆయనను కలిసి పూలబొకే అందజేశారు.

గడ్డమల్లయ్యగూడలో ఐఈఎస్ అధికారుల పర్యటన



గడ్డమల్లయ్యగూడలో అధికారుల బృందం

యాచారం: ఐఈఎస్(ఇండియన్ ఎకనామికల్ సర్వీస్) అధికారుల బృందం బుధవారం గడ్డమల్లయ్యగూడలో పర్యటించింది. ఈజీఎస్ నిధులతో గ్రామంలో చేపట్టిన డంపింగ్ యార్డ్, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, పంచాయతీ భవనాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, గ్రామ పాలనపై అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'శిల్పా' ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ పేరు

28న ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు ట్రాఫిక్ చిక్కులు తొలగించేందుకు నిర్మించిన శిల్పా లేఔట్-2 ఫ్లై ఓ వర్‌ను ఈ నెల 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) జ్ఞాపకార్థం ఈ ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టాలని సీఎం సూచించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రారంభోత్సవానికి ముందే పెయింటింగ్, సుందరీకరణలతో సహా అన్ని పనులను పూర్తి చేయాలని మేయర్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ఆదేశించారు. నగర పౌరులకు ప్రయోజనం చేకూర్చే నాణ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అందించడానికి జీహెచ్ఎంసీ కట్టుబడి ఉందని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

అఆలు వద్దు ABCD ముద్దు

కనుమరుగవుతున్న తెలుగు మీడియం

జిల్లాలో మొత్తం స్కూళ్లు: 3,203
ప్రభుత్వ: 1,300
ప్రైవేటు: 1,637
మొత్తం విద్యార్థులు: 9,50,079

- ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇంగ్లిష్‌కే మొగ్గు
- భవిష్యత్తు ఆంగ్లానిదేననే భావనలో తల్లిదండ్రులు, విద్యార్థులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రైవేటులోనే కాదు ప్రభుత్వ స్కూళ్లలోనూ తెలుగు మీడియం కనుమరుగవుతోంది. తెలుగు ఒక సబ్జెక్టుగా మినహా.. మిగిలినవన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే బోధిస్తున్నారు. భవిష్యత్తు మొత్తం ఇంగ్లిష్‌తోనే ముడిపడి ఉంటుందని తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు సైతం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గవర్నమెంట్ స్కూళ్లలో కూడా ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రవేశపెట్టింది. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పుస్తకాలను ముద్రిస్తోంది. విద్యార్థులంతా ఇంగ్లిష్ మీడియంపైనే మక్కువ చూపుతుండటంతో.. తెలుగు మీడియం చదివి, ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులు సైతం ఇంగ్లిష్ నేర్చుకుని పాఠాలు బోధించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,300పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1.30 లక్షల మందికిపైగా చదువుతున్నారు. వీరిలో కేవలం 15 వేల మంది మాత్రమే తెలుగు మీడియంలో అభ్యసిస్తున్నారు. పూర్వ ప్రాథమిక దశలోనే చిన్నారులను ఇంగ్లిష్ మీడియంలో చేర్పిస్తుండటంతో తెలుగు మీడియం స్కూళ్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రైవేటులో ఒక్క తెలుగు మీడియం స్కూల్ లేకపోవడంపై భాషా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అర్బన్‌లో ఫుల్.. తండాల్లో నిల్..

జిల్లాలో మొత్తం 3,203 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వీటిలో 9,50,079 మంది చదువుతున్నారు. 1,637 ప్రైవేటు స్కూళ్లలో 6,06,140 మంది, 107 సీబీఎస్ఈ స్కూళ్లలో 1,34,063 మంది, 10 ఐసీఎస్ఈ పాఠశాలల్లో 14,008 మంది చదువుతున్నారు. మిగిలిన వారంతా ప్రభుత్వ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలు, కేజీబీవీలు, జ్యోతి బాపూలే వసతి గృహాల్లో అభ్యసిస్తున్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. కోర్ సిటీకి ఆనుకుని ఉన్న ప్రభుత్వ పాఠశాలలు సహా మండల కేంద్రాల్లోని ప్రభుత్వ స్కూళ్లకు విద్యార్థులు పోటెత్తుతున్నారు. మారుమూల తండాల్లోని స్కూళ్లకు మాత్రం ఆశించిన ఆదరణ లభించడం లేదు. గత విద్యా సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 96 ప్రభుత్వ పాఠశాలల్లో జీరో పర్సంటేజీ అడ్మిషన్లు నమోదయ్యాయి. సింగిల్ టీచర్, మధ్యాహ్న భోజన పంపిణీ, పాఠశాల నిర్వహణ భారంగా మారడంతో గతేడాదే వీటిని మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకునే ప్రక్రియలో భాగంగా జిల్లా విద్యాశాఖ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన స్పందన లభించడం లేదు.

వెనుకాడుతున్న తల్లిదండ్రులు..

- కొందుర్గు మండలం రామన్నగూడతండా, జిల్లేడుచౌదరిగూడ మండలం వేపకుంచతండా, దారరగిద్దతండా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది కూడా అడ్మిషన్లు రాలేదు.
- చేవెళ్ల మండలం నారాయణదాసుగూడ, జాలగూడ, ఇబ్రహీంపల్లిలోనూ ఈసారి కూడా జీరో అడ్మిషన్లే.
- షాబాద్ మండలం మల్లారెడ్డిగూడ పాఠశాల రెండేళ్లుగా మూతబడి ఉంది. బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులను పంపాల్సిందిగా కోరినా.. ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు.
- కొత్తూరు మండలం పీఎస్‌రెడ్డిపాలెం స్కూలు మూతపడింది. ఉపాధ్యాయులు తెరిచే ప్రయత్నం చేసినా.. తల్లిదండ్రుల నుంచి స్పందన రావడం లేదు.
- శంకర్‌పల్లి మండలం కచ్చిరెడ్డిగూడ పాఠశాలో ఇప్పటి వరకు కేవలం రెండు అడ్మిషన్లు మాత్రమే నమోదయ్యాయి.
- లచ్చిరెడ్డిగూడ పాఠశాలల్లో కూడా ఒక్క అడ్మిషన్ కూడా రాలేదు.
- లక్ష్మారెడ్డిగూడ, ఇరుకుంటతండా స్కూల్‌లో అడ్మిషన్లు లేక గతంలో మూసివేశారు.
- ప్రస్తుతం లక్ష్మారెడ్డిగూడలో నాలుగు, ఇరుకుంట తండాలో రెండు అడ్మిషన్లు అయినా.. వీటి భవితవ్యం ప్రశ్నార్థకమే.
- మొయినాబాద్ మండలం చిన్నషాపూర్ స్కూల్‌ను గతంలో అడ్మిషన్లు లేక మూసేశారు. ఇటీవల ఐదురుగు విద్యార్థులు చేరారు.



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇందిరమ్మ నిర్మాణాల్లో వేగం పెంచండి

కలెక్టర్ నారాయణరెడ్డి

- అధికారులతో సమీక్ష

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం, వన మహోత్సవంపై బుధవారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బేస్మెంట్ లెవల్ పూర్తయిన ఇళ్లకు బిల్లులు చెల్లించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 56.33శాతం ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయిందని, మిగిలినవి కూడా త్వరగా ప్రారంభించాలని తెలిపారు.

25లోపు ప్రాంభించాలి

జూన్ 25 వరకు అన్ని ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం అవసరమైతే పేద మహిళకు బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. గ్రౌండింగ్ పూర్తయిన 15 రోజుల్లో పనులు లెంటల్ లెవెల్‌కు చేరేలా చూడాలన్నారు. 25లోపు కూడా గ్రౌండింగ్ కాని ఇళ్లను రద్దు చేసి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని తెలిపారు. ఇప్పటి వరకు మొయినాబాద్, నార్సింగి, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీల్లో తక్కువ గ్రౌండింగ్ నమోదైందని వివరించారు. ఆయా మండలాల అధికారులు అప్రమత్తం కావాలని దిశానిర్దేశం చేశారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి ఇసుక తెచ్చుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామ, మున్సిపల్ పరిధిలో ఈనెల 20నుంచి 28 వరకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. డ్రైనేజీలను శుభ్రం చేయించి, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, లీకేజీలను సరిచేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రోడ్లపై గుంతలను పూడ్చాలని ఆదేశించారు. జూలై మొదటి వారంలో ఆడిట్ బృందాలు తనిఖీకి వస్తాయని, సరిగా పనిచేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి, గుంతలు తీయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, డీపీఓ సురేష్ మోహన్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి కేషురామ్, హౌసింగ్ పీడీ హనుమంతు నాయక్, గ్రామీణ అభివృద్ధి శాఖ పీడీ శ్రీలత, మెప్మా పీడీ మల్లీశ్వరి, డీఈఓ సుశీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల సహకార సంఘం కార్యాలయంలో ఉత్తమ ఖాతాదారులను సన్మానించిన అధికారులు

సకాలంలో రుణాలు చెల్లించాలి

- నాబార్డ్ డీసీఓ సుధాకర్, డీడీఎం హర్ష
- సొసైటీ బ్యాంకుల ఉత్తమ ఖాతాదారులకు సన్మానం

చేవెళ్ల: సొసైటీ బ్యాంకుల నుంచి రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని నాబార్డ్ డీసీఓ సుధాకర్, డీడీఎం హర్ష, డీసీసీబీ ఎఫ్ఎల్సీ లక్ష్మీకాంత్, డీసీఓ నాగేశ్వర్ అన్నారు. చేవెళ్ల సహకారం సంఘం కార్యాలయంలో బుధవారం సొసైటీ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకోసం పనిచేసే సొసైటీలను కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా రైతులపైనే ఉందన్నారు. మార్టిగేజ్ ద్వారా భూములపై అందించే రుణాల పరిమితిని పెంచుతున్నాట్లు స్పష్టంచేశారు. రుణాల చెల్లింపులో ఉత్తమ ఖాతాదారులుగా ఎంపికైన మధుసుధన్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, ఆనంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ బ్రాంచ్ మేనేజర్ బాలకృష్ణ, కార్యదర్శి వెంటకయ్య, డైరెక్టర్లు మధుసుధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్యామలయ్య, నర్సింలు, రాములు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడు

వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన కన్నకొడుకే తండ్రి పాలిట యముడయ్యాడు. పొలం అమ్మనివ్వడం లేదని కక్ష పెంచుకుని.. నిద్రపోతున్న తండ్రిపై పాశవికంగా దాడి చేసి, కాటికి పంపించాడు.

- కందుకూరు మండలం పులిమామిడిలో దారుణం
- భూమి అమ్మనివ్వడం లేదని కక్ష పెంచుకున్న కొడుకు
- బండరాయితో మోది, కర్రతో బాది హత్య
- పోలీసుల అదుపులో నిందితుడు



రక్తం మడుగులో పడి ఉన్న మృతుడు చిన్న జంగయ్య, హత్యకు ఉపయోగించిన బండరాయి, కర్ర



చిన్న జంగయ్య(ఫైల్)

కందుకూరు: ఓ కొడుకు కన్నతండ్రిని దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పులిమామిడిలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పసుపుల చిన్న జంగయ్య(65), పద్మమ్మ భార్యభర్తలు. తముకున్న అర ఎకరం పొలాన్ని సాగు చేయడంతో పాటు గొర్రెలను పోషిస్తూ బతుకుతున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం. అందరికీ వివాహాలు కాగా కొడుకు శేఖర్ సెంట్రింగ్ పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. కొంతకాలంగా పొలాన్ని అమ్మాలంటూ శేఖర్ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. ఇటీవల పాత ఇంటి స్థలంలోనే కొత్త ఇల్లు నిర్మిస్తున్నారు. పొలం అమ్మి ఇల్లు పూర్తి చేద్దామని శేఖర్ గొడవ పడుతున్నాడు. ఈవిషయమై పలుమార్లు గ్రామస్తుల మధ్య పంచాయితీ నిర్వహించగా అతన్ని మందలించారు. పిల్లర్లు, స్లాబ్ పూర్తి కావడంతో జంగయ్య దంపతులు పరదాలు కట్టుకుని ఇక్కడే ఉంటున్నారు. శేఖర్ గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. మంగళవారం రాత్రి పద్మమ్మ ఇదే ఊరిలో ఉండే తన బిడ్డ ఇంటికి వెళ్లింది. దీంతో జంగయ్య ఒక్కడే కొత్త ఇంటి వద్ద నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కడికి వెళ్లిన శేఖర్ నిద్రపోతున్న తండ్రి తలపై బండరాయితో మోది, కట్టెతో కొట్టి చంపేశాడు. అనంతరం ఏమీ ఎరగనట్లు అద్దె ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం 5.45 గంటల సమయంలో ఇంటికి వచ్చిన పద్మమ్మ రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి గుండెలు బాదుకుంది. అక్కడికి చేరుకున్న గ్రామస్తులు, బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. శేఖరే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని అతనిపై దాడికి ప్రయత్నించగా అక్కడికి చేరుకున్న సీఐ సీతారామ్, ఎస్ఐ సైదులు అతన్ని అదుపులోకి తీసుకుని, పీఎస్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తన కొడుకే ఈ దారుణానికి పాల్పడ్డాడని పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మతం ముసుగులో మోదీ పాలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న చాడా వెంకట్‌రెడ్డి

- కగార్ పేరుతో అమాయకులను ఎన్‌కౌంటర్ చేస్తున్న కేంద్రం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్: మోదీ సర్కార్ మతాన్ని అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై కులమతాల దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో బుధవారం నిర్వహించిన పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మతతత్వ పార్టీలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. దేశ సరిహద్దులో ఉన్న శత్రువులను పారదోలాల్సిన కేంద్ర ప్రభుత్వం .. కగార్ పేరుతో అమాయక ప్రజలను ఎన్‌కౌంటర్ చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీపీఐ.. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతోందన్నారు. రావి నారాయణరెడ్డి కాలనీ- 3లో గుడిసెలు వేసుకుని ఇళ్ల కోసం పోరాటం చేస్తున్నవారికి నివాస స్థలాలు సాధించే వరకు అండగా ఉంటామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవింద్రచారి, కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్ నాయక్, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, నాయకులు నర్సింహ, నవనీత, అరుణ, మాధవరెడ్డి, వేణు, ప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్ ఫీల్డ్ విజిట్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ



సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పోచారం మున్సిపాలిటీలోని సంస్కృతి టౌన్‌షిప్‌తో పాటు ఏకశిలా నగర్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలను పరిశీలించారు. సంస్కృతి టౌన్‌షిప్‌లో 100 ఫీట్ల రహదారికి అడ్డంగా స్థల యజమానులు పెట్టిన గేట్లను హైడ్రా కమిషనర్ తెరిపించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 ఫీట్ల రహదారికి మార్కింగ్ చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొర్రెముల గ్రామంలోని ఏకశిలానగర్ లేఔట్‌కు సంబంధించి వివాదం పైనా ఆయన ఆరా తీశారు. కోర్టు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నా కబ్జాదారులు ఇల్లు కట్టుకొనివ్వడం లేదని ప్లాట్ల యజమానులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వివాదానికి సంబంధించి ఇరుపక్షాలను పిలిచి అన్ని రికార్డులను పరిశీలిస్తామని రంగనాథ్ హామీ ఇచ్చారు. నెక్నాంపూర్‌లో ప్రధాన రహదారి నిర్మాణానికి ఉన్న ఆటంకాలను ఆయన పరిశీలించారు. అక్కడ దాదాపు 20 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా కొందరు స్థానికులు అది తమదే అంటూ రోడ్డు వేయనీయకుండా అడ్డుకోవడాన్ని ఆయన పరిశీలించారు. హైటెన్షన్ వైర్ల కింద నిర్మిస్తున్న రోడ్డుకు ఆటంకాలు కల్పించవద్దని కమిషనర్ స్థానికులకు సూచించారు. దీనిపైనా వచ్చే వారం సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. గచ్చిబౌలిలోని జనార్దన హిల్స్ వద్ద జరుగుతున్న వరద కాలువ పనులను, చుట్టుపక్కల కొన్ని ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలు ఆయన పరిశీలించారు. ఖాజాగూడ... ఖైతలాపూర్ వద్ద ముల్లకత్వ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే వరద కాలువ ఆక్రమణలను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. ఐడీఎల్ చెరువు నుంచి కూకట్‌పల్లి నాలాలకు వెళ్లే వరద కాలువ ఆక్రమణలను తనిఖీ చేశారు. ఐడీఎల్ చెరువు నుంచి వెళ్లే నాలా ఆక్రమణ జరిగినట్టు గుర్తించిన హైడ్రా కమిషనర్ నాలా విస్తరణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు మూసాపేట మెట్రో స్టేషన్ పరిసరాల్లో నాలా కుంచించుకుపోవడంతో వరద ముంచెత్తుతోందని స్థానికులు రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. శివశక్తినగర్‌లో నాలా విస్తరణతో ఈ సమస్య పరిష్కారం అవుతుందని, వెంటనే ఆ పనులు చేపట్టాలని అధికారులకు రంగనాథ్ సూచించారు.

స్థానిక పోరులో సత్తా చాటాలి



మల్లేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న బర్క కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాబాద్‌: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ఆకాంక్షించారు. మండలంలోని దామర్లపల్లి గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కమ్మరి దయాకర్‌చారి ఆధ్వర్యంలో యువజన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోకుల మల్లేష్‌, ప్రధాన కార్యదర్శిగా బోకుల మహేందర్‌, ఉపాధ్యక్షులు బండ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బర్క కృష్ణ మాట్లాడుతూ.. బీసీలు ఐకమత్యంతో ఉంటూ ముందుకు సాగాలని, అప్పుడే ఏదైనా సాధించగలమన్నారు. దేశ వ్యాప్తంగా బీసీలను చైతన్యం చేసి గ్రామస్థాయి నుంచి బలమైన ఉద్యమాన్ని నిర్మించి హక్కులను సాధించాలన్నారు. దేశ జనాభాలో బీసీలు అధిక శాతం ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అణచివేతకు గురవుతూనే ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌, నాయకులు లింగం, మచ్చేందర్‌, వెంకటేష్‌ముదిరాజ్‌, వరలక్ష్మి, శారదగౌడ్‌, నర్సింహులు, బాల్‌రాజ్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనుల పరిశీలన



అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యా కమిషన్‌ మెంబర్‌ జ్యోత్స్న

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని దావుత్‌ఖాన్‌ గూడలో నిలిచిపోయిన పాఠశాల నిర్మాణ పనులు బుధవారం రాష్ట్ర విద్యా కమిషన్‌ మెంబర్‌ జ్యోత్స్న శివారెడ్డితో కలిసి మాజీ మేయర్‌ చిగురింత పారిజాత సందర్శించారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ.. ఈ ఏడాది అకాడమిక్‌లోపు పాఠశాల నిర్మాణ పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గతంలో కమిషన్‌ మెంబర్‌కు విన్నవించగా ఆ ఫిర్యాదు మేరకు సందర్శించారన్నారు. ఒకేచోట డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్‌ కాలేజీలు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. బడంగ్‌పేటలోని జిల్లా పరిషత్‌ పాఠశాల, పాలిటెక్నిక్‌, డిగ్రీ కళాశాలలను సందర్శించి ఆమె వివరాలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, మాజీ కార్పొరేటర్‌ సుదర్శన్‌రెడ్డి, నాయకులు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బి.కుమార్‌, విజయ్‌ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి చేయూత

ఆమనగల్లు: పట్టణానికి చెందిన దివ్యాంగుడు వస్పుల ఆనంద్‌కుమార్‌ కుటుంబానికి హోప్‌ ఫర్‌ స్పందన సంస్థ అండగా నిలిచింది. అతనికి రూ.70 వేలతో కిరాణా దుకాణం పెట్టించింది. నార్త్‌ అమెరికా తెలుగు సంఘం ఆర్థిక సహకారంతో ఏర్పాటైన ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవాసంస్థ దివ్యాంగుల ఉపాధికి చేయూతనిస్తోంది. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన దివ్యాంగుడు ఆనంద్‌కుమార్‌కు రిఫ్రిజిరేటర్‌, కిరాణ సామన్లు అందించి స్వయం ఉపాధి కల్పించింది. హోప్‌ ఫర్‌ స్పందన తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త డాక్టర్‌ అరికపుడి రఘు బుధవారం షాపును ప్రారంభించారు. ఇప్పటివరకు 119 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పించామని చెప్పారు. వెయ్యిమందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కోట లక్ష్మీ నర్సింహం, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో దివ్యాంగునికి ఏర్పాటు చేసిన కిరాణాషాపు వద్ద రఘు అరికపూడి

కొత్త కలెక్టర్‌.. పెట్టండి నజర్‌!

ప్రభుత్వ జాగాల్లో అక్రమార్కుల పాగా

- గ్రేటర్‌లో మాయమవుతున్న ఖాళీ స్థలాలు
- సైన్‌ బోర్డులు పెట్టినా మూణ్నాళ్ల ముచ్చటే..
- కబ్జాదారులకు క్షేత్రస్థాయిలో అండదండలు
- రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం
- కఠినంగా వ్యవహరించాలని హరిచందనకు పౌరుల వినతి



కలెక్టర్‌ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ నగరంలో భూమి బంగారమే. గజం స్థలం విలువ తులం బంగారానికి కంటే అధికమే. ఇప్పటివరకు రెవెన్యూ యంత్రాంగం ఉదాసీన వైఖరి, క్షేత్ర స్థాయిలో తహసీల్‌ అధికారులు, సిబ్బంది అండదండలతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు కనుమరుగవుతూనే ఉన్నాయి. నగరంలో రెవెన్యూ అంటే ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ప్రధానంగా పని చేయాల్సి ఉంటుంది. కానీ.. కంచే చేను మేసిన విధంగా రెవెన్యూ యంత్రాంగం పనితీరు తయారైంది. ఇటీవల కొత్తగా హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన యువ ఐఏఎస్‌ అధికారిణి హరిచందన దాసరి.. సర్కారు స్థలాల పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరముందని నగర పౌరులు ఆశిస్తున్నారు. అందరి మాదిరిగానే కేవలం సమావేశాలు, ఆదేశాలకు పరిమితమైతే మాత్రం.. సర్కారు స్థలాల పరిరక్షణ హుళక్కే అన్న చందంగా మారుతుంది. కబ్జాదారులపై ఆమె కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉంది.

ప్రభుత్వ భూముల్లో పాగా..

నగరంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్రమార్కులు దర్జాగా పాగా వేస్తున్నారు. ప్రభుత్వ స్థలం అంటూ సైన్‌ బోర్డులు ఏర్పాటు చేస్తున్నా.. వాటిని సైతం తొలగిస్తూ దర్జాగా తొలగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఖాళీ స్థలాలపై నిర్మాణాలు వెలసిన తర్వాత ఫిర్యాదులు, ఒత్తిళ్లు వస్తే గానీ స్థానిక రెవెన్యూ యంత్రాంగం స్పందించక పోవడం నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సర్కారు స్థలాల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలకు ఉపక్రమించేలోపు.. అవి కోర్టు వివాదాల్లో చిక్కుకోవడం సర్వసాధారణంగా తయారైంది. ఇలా కోర్టు కేసుల్లో చిక్కుకున్న వందల కోట్ల రూపాయల విలువైన భూములపై సమగ్ర ఆధారాలు, వాదనలు లేక ఏళ్ల తరబడి పెండింగ్‌లో మగ్గడం షరామాములుగా మారింది. కొన్ని కేసులకు ఏళ్ల తరబడి కౌంటర్‌ దాఖలు కాని పరిస్థితి కూడా లేకపోలేదన్న ఆరోపణలు వినపిస్తున్నాయి. రెవెన్యూ యంత్రాంగం వద్ద స్థలాలకు సంబంధించిన సమగ్ర ఆధారాలు లేని కారణంగా క్రమంగా అక్రమ కట్టడాలు సక్రమ కట్టడాల జాబితాలో చేరిపోతున్నాయి.

కలెక్టర్లు మారినప్పుడల్లా..

జిల్లా కలెక్టర్‌ మారి కొత్త వచ్చినవారు సర్కారు స్థలాలపై దృష్టి సారించడం.. పరిరక్షణకు పలు చర్యలు చేపట్టినా.. క్షేత్ర స్థాయిలో అమలు మూణ్నాళ్ల ముచ్చటగానే తయారవుతోంది. ఆరేళ్ల క్రితం అప్పటి కలెక్టర్‌ యోగితా రాణా ప్రత్యేకంగా ల్యాండ్‌ బ్యాంక్‌ యాప్‌ రూపకల్పన చేసి ప్రభుత్వ స్థలాలకు కంచె, సైన్‌ బోర్డుల ఏర్పాటు, ఆన్‌లైన్‌ మానిటింగ్‌, ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో భద్రపర్చడం లాంటి చర్యలు చేపట్టారు. వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించి ప్రతిరోజూ భూములపై పర్యవేక్షణతో పాటు పక్షం రోజులకోసారి తనిఖీ చేసి తగిన సమాచారాన్ని సంబంధిత తహసీల్దార్‌, భూ పరిరక్షణ అధికారులకు అందించేలా కసరత్తు చేశారు.

- యోగితా రాణా బదిలీ తర్వాత ల్యాండ్‌ బ్యాంక్‌ యాప్‌ అమలు మూలకుపడింది. ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి ల్యాండ్‌ బ్యాంక్‌ యాప్‌ను పునరుద్ధరించి భూముల వివరాల అప్‌డేట్‌ ప్రక్రియతో పాటు రక్షణ కోసం చర్యలకు ఉపక్రమించినా.. ఆచరణలో ముందుకు సాగలేదు.

ఇదీ పరిస్థితి

- హైదరాబాద్‌ జిల్లా రెవెన్యూ పరిధిలో సుమారు 16 మండలాలు ఉన్నాయి. పదేళ్ల క్రితం వరకు ల్యాండ్‌ బ్యాంక్‌లో 1,138 పార్శిల్స్‌ ఉండగా ప్రస్తుతం వాటి 1075 పార్శిల్స్‌కు చేరినట్లు అధికార గణాంకలు స్పష్టం చేస్తున్నా.. వాస్తవ పరిస్థితిలో పార్శిల్స్‌ మరింత తగ్గినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద 890 ల్యాండ్‌ పార్శిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 40,66,914.08 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఉంది. మిగతా పార్శిల్స్‌లో సుమారు 11,45,334.95 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఆక్రమితకు గురైనట్లు తెలుస్తోంది. సుమారు 169 పార్శిల్స్‌లోని దాదాపు 11,93,595.12 చదరపు గజాల విస్తీర్ణ గల ఖాళీ స్థలంతోపాటు 445098.64 చదరపు గజాల ఆక్రమిత భూమి కోర్టు కేసుల్లో ఉనట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

తల్లీకూతుళ్ల ఆచూకీ లభ్యం



పిల్లలతో సహా సూజతను భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

కేశంపేట: మిస్సింగ్‌ కేసును కేశంపేట పోలీసులు ఛేదించారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన డోల సుజాత తన కూతుళ్లు గౌతమి, ప్రవళికలు ఈ నెల 3న అదృశ్యమయ్యారు. ఇదే విషయమై భర్త శేఖర్‌ 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు అదృశ్యమైన వారు యాదగిరిగుట్ట నుంచి చెరువుగట్టుకు వెళ్లినట్టు గుర్తించారు. వీరిని చెరువుగట్టులో గుర్తించి స్టేషన్‌ పిలిపించారు. అక్కడి నుంచి కేశంపేటకు తీసుకొచ్చి బుధవారం భర్తకు అప్పజెప్పారు. నాలుగు రోజుల్లోనే కేసును ఛేదించినందుకు సీఐ నరహరి, ఎస్‌ఐ రాజ్‌కుమార్‌, ఏఎస్‌ఐ నర్సింహులు శెట్టి, సిబ్బంది రమాదేవి తదితరులు స్థానికులు అభినందించారు.

మహిళల రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్‌: ఆపద సమయంలో మహిళలను రక్షించడమే షీటీమ్‌ లక్ష్యమని హెడ్‌కానిస్టేబుల్‌ బిచ్చయ్య అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్‌ విద్యుల్లత ఆధ్వర్యంలో విద్యార్థినులకు పోక్సోచట్టం, గుడ్‌టచ్‌, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీమ్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ బిచ్చయ్య మాట్లాడుతూ.. ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సెల్‌ఫోన్‌, ఫేస్‌బుక్‌, వాట్సాప్‌, ఇన్‌స్టాగామ్‌ వంటి సోషల్‌ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు ఏడిపించినా, ఇబ్బందులకు గురిచేసినా వెంటనే షీటీమ్‌తో పాటు 100, 181కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ విద్యుల్లత మాట్లాడారు. కార్యక్రమంలో షీటీమ్‌ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సహదేవ్‌ (ఫైల్‌)

శంకర్‌పల్లి: ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జన్వాడ గ్రామానికి చెందిన సహదేవ్‌ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 7న తన కుమారుడు మల్లేశ్‌ భార్యతో కలిసి హాస్పిటల్‌కి వెళ్లాడు. అనంతరం 9వ తేదీన ఇంటికి రాగా అప్పటినుంచి సహదేవ్‌ కనిపించలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరువునష్టం కేసు వాయిదా

సిటీ కోర్టులు: భారతీయ జనతాపార్టీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై బుధవారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. విచారణకు ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో ఆయన తరుపు న్యాయవాది విశ్వేశ్వర్‌రావు పిటిషన్‌ దాఖలు చేశారు. అయితే ఈ కేసులో ముఖ్యమంత్రికి హైకోర్టు స్టే ఇచ్చినట్లు కోర్టుకు సూచించారు. అనంతరం మెమోతో పాటు హైకోర్టు మంజూరు స్టే ఉత్తర్వులను ఆయన కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు సాక్షులను వచ్చే విచారణలో క్రాస్‌ ఎగ్జామినేషన్‌ చేయాలని న్యాయవాదికి సూచిస్తూ విచారణను జులై 3కి వాయిదా వేసింది.

సాగర్‌ నాలా బ్రిడ్జిపై కూలిన వర్టికల్‌ గార్డెన్‌

నల్లకుంట: కాలుష్య నివారణ కోసం నల్లకుంట డివిజన్‌ పరిధిలోని రత్నానగర్‌ హుస్సేన్‌ సాగర్‌ నాలా బ్రిడ్జిపై రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వర్టికల్‌ గార్డెన్‌ ఒకవైపు బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలింది. ఆ సమయంలో వాహనదారులు, పాదచారుల సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రత్నానగర్‌ బస్తీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కిషోర్‌ కుమార్‌ అందించిన సమాచారం మేరకు హైడ్రా, హార్టికల్చర్‌, జీహెచ్‌ఎంసీ, ఎన్‌డీఆర్‌ఎఫ్‌ బృందాలు వెంటనే అక్కడికి చేరుకుని మూడు గంటలపాటు శ్రమించి శిథిలాలను తొలగించారు. హార్టికల్చర్‌ విభాగం నిర్వహణ లోపం వల్లే వర్టికల్‌ గార్డెన్‌ కూలిపోయిందని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల నుంచి రూ.18 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. కాగా, బ్రిడ్జి వద్ద తీవ్రమైన దుర్గంధం వెలువడుతుంటంతో కాలుష్య నివారణకుగాను 2023లో అధికారులు రూ.40 లక్షలతో ఇరువైపులా వర్టికల్‌ గార్డెన్‌ నిర్మించారు. వివిధ రకాల పూల మొక్కలను ఏర్పాటు చేశారు.

ఆభరణాల వ్యాపారుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లోని ఆభరణాల వ్యాపారుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ నంబర్‌ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌ (హెచ్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌ కమిషనర్‌ సీవీ ఆనంద్‌ +91 8712661555 హెల్ప్‌లైన్‌ నంబర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అత్యవసర భద్రతా సమస్యలను విన్నవించేందుకు, మార్గదర్శకత్వం, కమ్యూనిటీ పోలీసింగ్‌ చొరవలు తదితరాల కోసం ఈ హెల్ప్‌లైన్‌లో సంప్రదించవచ్చని కమిషనర్‌ తెలిపారు. కార్యక్రమంలో లా అండ్‌ ఆర్డర్‌ అదనపు కమిషనర్‌ విక్రమ్‌ సింగ్‌ మాన్‌, హెచ్‌సీఎస్‌సీ జనరల్‌ సెక్రటరీ సి.శేఖర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూత్రశాలలు శుభ్రం చేసిన విద్యార్థులు

ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు, తల్లిదండ్రులు

షాద్‌నగర్‌రూరల్‌: ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని నేరళ్లచెరువు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు విద్యార్థులతో మూత్రశాలలను శుభ్రం చేయించారు. దీనిపై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు చెప్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే చిన్నారులతో మూత్రశాలలను శుభ్రం చేయించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో స్వీపర్‌ చేయాల్సిన పనులను పిల్లలతో చేయిస్తున్నారని.. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఉపాధ్యాయులపై మండి పడుతున్నారు. చిన్నారులు మూత్రశాలలను శుభ్రం చేస్తున్న సమయంలో గ్రామస్తులు వీడియో తీశారు. చిన్నారులతో ఎందుకు చేయిస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలితో పాటు ఉపాధ్యాయులను ప్రశ్నించగా అలాంటిది ఏమీ లేదని బుకాయించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మూత్రశాలలను శుభ్రం చేస్తున్న విద్యార్థి

గంజాయి విక్రయిస్తున్న మైనర్‌ రిమాండ్‌

ఘట్‌కేసర్‌: గంజాయి విక్రయిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్న ఘట్‌కేసర్‌ పోలీసులు బుధవారం అతడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎదులాబాద్‌కు చెందిన ఓ బాలుడు (17) గంజాయి సేవించడమే కాకుండా ఇతరులకు విక్రయిస్తున్నాడు. తన స్నేహితుడి రవితో కలిసి ఒడిశా వెళ్లిన అతను సోను అనే వ్యక్తి నుంచి 3.13 కిలోల గంజాయి కొనుగోలు చేసి రైలులో నగరానికి తీసుకొచ్చాడు. మంగళవారం సాయంత్రం ఎన్‌ఎఫ్‌సీ నగర్‌ చందుపట్లగూడ లింగారెడ్డి వెంచర్‌లో కొందరికి విక్రయిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయి స్వాదీనం చేసుకుని అతడిని రిమాండ్‌కు తరలించారు.

ఆటో అడ్డు పెట్టారన్నందుకు..

అమీర్‌పేట: కారుకు ఆటో అడ్డుగా పెట్టారంటూ వాచ్‌మెన్‌తో ఓ యువకుడు గొడవ పడుతుండగా వాచ్‌మెన్‌ కుమారుడు అతడిపై కత్తెరతో దాడి చేసిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఆర్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబర్‌పేటకు చెందిన ప్రదీప్‌ మొక్కులు తీర్చుకునేందుకు మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. అదే సమయంలో బీకేగూడ సీనియర్‌ సిటిజన్‌ కార్యాలయం ఎదుట జరుగుతున్న విందుకు ప్రదీప్‌ స్నేహితులు శివప్రసాద్‌ (25) శ్రీకాంత్‌తో పాటు మరో ఇద్దరు యువకులు హాజరయ్యారు. ధనలక్ష్మి అపార్ట్‌మెంట్‌ కింద రోడ్డుపై నిలిపిన వారు భోజనం చేసిన అనంతరం కారు వద్దకు వచ్చారు. అయితే కారుకు ఆటో అడ్డుగా ఉండటంతో అపార్ట్‌మెంట్‌ వాచ్‌మెన్‌ శ్రీనివాస్‌ వద్దకు వెళ్లి ఆటో ఎవరిదని అడిగారు. అపార్ట్‌మెంట్‌ యజమాని ఇదే భవనంలో బుక్‌షాప్‌ నిర్వహిస్తున్నాడని, సామగ్రిని సరఫరా చేసే ఆటో డ్రైవర్‌ ఆటో పార్కింగ్‌ చేసి వెళ్లిపోయినట్లు చెప్పాడు. శివప్రసాద్‌ వాచ్‌మెన్‌తో వాగ్వాదానికి దిగడంతో పెద్ద ఘర్షణ జరిగింది.

ఆదరణ తగ్గుతున్న ‘గ్రామీణాభివృద్ధి’



ఏజీవర్సిటీ: 1980 దశకం వరకు చేసిన ప్రయత్నాలతో పోలిస్తే కొన్ని దశాబ్దాలుగా అంతర్జాతీయ స్థాయిలో గ్రామీణాభివృద్ధి అనే అంశం ఆదరణ కోల్పోతోందని ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌ డైరెక్టర్‌ జనరల్‌ డాక్టర్‌ జి.నరేంద్రకుమార్‌ అన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్‌ సంస్థ(ఎన్‌ఐఆర్‌డీపీ)లో ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఇందులో ప్రధానంగా మూడు సంస్థలు ఇంటిగ్రేటెడ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌(సీఐఆర్‌డీఏపీ), నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ రూరల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ పంచాయతీ రాజ్‌(ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌), రూరల్‌ ఎకనామిక్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ(ఆర్‌ఈఈడీఎస్‌)లు పాల్గొన్నాయి. ఆయన మాట్లాడుతూ జూలై 6న ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినోత్సవం సందర్భంగా గ్రామీణాభివృద్ధి విధానాలు, కార్యక్రమాలను పంచుకోవడానికి రాజకీయ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు గ్రామీణ వర్గాలతో ముఖాముఖి చర్చలు జరుపుతున్నారన్నారు. ప్రొఫెసర్‌ అనిల్‌ కె.గుప్తా పన్ని మాట్లాడుతూ అభివృద్ధి పటంలో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయని అన్నారు. ఎంటర్‌ప్రైజ్‌ డెవలప్‌మెంట్‌ మోడల్‌ ఈ అంతరాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఐటీ రంగంలో పట్టణ స్టార్టప్‌లకు కేటాయించిన రిస్క్‌ క్యాపిటల్‌ మాదిరిగానే గ్రామీణ స్టార్టప్‌లకు సమానమైన మద్దతు అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఇండోనేషియా, శ్రీలంక, మలేషియా, వియత్నాం, లవోపీడీఆర్‌, మయన్మార్‌, థాయిలాండ్‌, పీజీ, ఫిలిప్పీన్స్‌, బంగ్లాదేశ్‌, భారతదేశం వంటి 11 సీఐఆర్‌డీఏపీ సభ్య దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టిసారించండి

- వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి
- డీపీఓ సురేష్‌మోహన్‌
- దండుమైలారంలో పర్యటన

ఇబ్రహీంపట్నం: వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్‌ మోహన్‌ సూచించారు. బుధవారం దండుమైలారం గ్రామ పంచాయతీని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీ, డంపింగ్‌యార్డును, వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వానాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తిచెంది వ్యాధులు ప్రబలే అవకాశముంటుందన్నారు. క్రమంతప్పకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలని సూచించారు. ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్‌ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎస్‌ రఘు, పంచాయతీ కార్యదర్శి పి.శివకుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.



దండుమైలారంలో మొక్కలు నాటేందుకు తీసిన గోతులను పరిశీలిస్తున్న డీపీఓ సురేష్‌మోహన్‌

మద్యం మత్తులో బస్సు డ్రైవింగ్‌

బంజారాహిల్స్‌: మద్యం మత్తులో బడి బస్సులు నడుపుతూ పలువురు డ్రైవర్లు పట్టుబడడం కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే... బుధవారం ట్రాఫిక్‌ డీసీపీ రాహుల్‌ హెగ్డే ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ పోలీసులు స్పెషల్‌ డ్రంకన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ప్రధానంగా స్కూల్‌ బస్సు డ్రైవర్లను టార్గెట్‌ చేసుకుని జూబ్లీహిల్స్‌, బంజారాహిల్స్‌, పంజగుట్ట, బేగంపేట, ఎస్సార్‌నగర్‌, మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, మహంకాళి, గోపాలపురం ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 34 ప్రాంతాల్లో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించిన పోలీసులు 324 మంది డ్రైవర్లను పరీక్షించారు. ఈ సందర్భంగా ఐదుగురు డ్రైవర్లు మద్యం మత్తులో బస్సులు నడుపుతూ పట్టుబడటంతో ట్రాఫిక్‌ పోలీసులు ఆయా పాఠశాల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యాలు ఈ విషయంలో డ్రైవర్లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి డ్రైవర్‌ తప్పనిసరిగా ఎంవీ యాక్ట్‌ ప్రకారం అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.